క్లుప్తంగా

విద్యాదానం గొప్పది



విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ప్రభుదాస్

కమలాపురం : దానాలలో కెల్లా విద్యా దానం గొప్పదని కమలాపురం మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు ప్రభుదాస్ తెలిపారు. సోమవారం స్థానిక షాలేము ప్రార్థన మందిరంలో లీడ్స్–కడప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమ్‌దాస్‌హని హాంగ్‌కాంగ్ వారి ఆర్థిక సహకారంతో వితరణ చేసిన విద్యా సామగ్రిని పట్టణానికి చెందిన 100 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద పంచుతూ పోతే తరిగి పోతుందని, అదే విద్య పంచుతూ పోతే పెరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ తన సంపాదనలో ఎంతో కొంత భాగం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



మురళీమోహన్

చింతకొమ్మదిన్నె : కడప నగర శివారులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.మురళీమోహన్ నాయక్‌కు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మురళీమోహన్ కేఎస్‌ఆర్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌ఎస్ మూర్తి పర్యవేక్షణలో 'పర్‌ఫార్మెన్స్ అగుమెంటేషన్ ఆఫ్ కంబైన్డ్ సైకిల్ పవర్‌ప్లాంట్ విత్ ఇన్‌లెట్ ఎయిర్ కూలింగ్ వెపర్ అబార్షన్ రిఫ్రిజిరేషన్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా మురళీమోహన్ నాయక్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ఖాజీపేట : ఆంజనేయ స్వామి వార్షికోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. సుంకేశుల ఎస్సీ కాలనీలో కొలువైన ఆంజనేయస్వామికి ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆకు పూజ నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యులు ఆటల పోటీలను నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతుల ప్రదానం చేశారు.

చల్లబడ్డ పోరుమామిళ్ల

పోరుమామిళ్ల : సోమవారం కురిసిన వర్షంతో పోరుమామిళ్ల చల్లబడింది. ఉక్కపోతతో రెండు నెలలుగా ప్రజలు అల్లాడిపోయారు. ఋతు పవనాల పుణ్యమాని ఆకాశంలో మేఘాలు అలుముకొని, వాన పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. బయటకు రావాలంటేనే హడలెత్తిపోయేవారు. అలాంటిది ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

720 క్వింటాళ్ల జనుములు మంజూరు

చాపాడు : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం చేసుకునే రైతుల కోసం 720 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు అయిన జనుములు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఇ.మ్యాగీ తెలిపారు. జనుములో కిలో రూ.88లు కాగా 50శాతం సబ్సిడీతో రూ.44లకే రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. జనుములు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫోను నంబర్‌తో వెళ్లి వీఏఏల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

'వైఎస్సార్‌సీపీదే అధికారం'

ఖాజీపేట : వైఎస్సార్‌సీపీనే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధీమావ్యక్తం చేశారు. దుంపలగట్టులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేకుండా ప్రజారంజక పాలన అందించారని కొనియాడారు. అందువల్లే ఈ ఎన్నికల్లో మహిళలు జగన్‌కు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. జిల్లాలో అన్ని స్థానాలను కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

విద్యతోపాటు ఆట, పాట అవసరం



దేశభక్తి గేయాలు పాడుతున్న విద్యార్థులు

అట్లూరు : విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆట, పాట అంతే ముఖ్యమని గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో సోమవారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు దేశభక్తి గేయాలు, ఆటలపోటీలు, పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు.

18 రౌండ్లలో కమలాపురం ఫలితం

- నియోజకవర్గంలో పోలింగ్‌స్టేషన్‌లు 251
- ఓటర్లు 204169 మంది
- ఓటు హక్కు వినియోగించుకున్న వారు 172401





కమలాపురం ఏరియల్ వ్యూ

వల్లూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ జరగనుంది. నియోజకవర్గంలో 251 పోలింగ్ స్టేషన్‌లు వుండగా వాటి పరిధిలో మొత్తం 204169 మంది ఓటర్లు వున్నారు. అందులో 99851 మంది పురుషులు, 104284 మంది మహిళలు, 34 మంది ట్రాన్స్ జెండర్‌లు వున్నారు. కాగా మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో మొత్తం 172401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 83861 మంది పురుషులు, 88528 మంది మహిళలు, 12 మంది ట్రాన్స్ జెండర్‌లు వున్నారు. కాగా నియోజకవర్గం మొత్తం మీద 2009 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.

మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

కమలాపురం నియోజకవర్గంలో 6 మండలాలు వున్నాయి. ఇందులో కమలాపురం మండలంలో 34848 మంది, చెన్నూరు మండలంలో 25661, వల్లూరు మండలంలో 19959, వీరపునాయునిపల్లె మండలంలో 21977, పెండ్లిమర్రి మండలంలో 31206, చింతకొమ్మదిన్నె మండలంలో 38750 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

14 టేబుళ్ల ఏర్పాటు

ఎన్నికల కౌంటింగ్‌కు గానూ కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట కమలాపురం మండలంలోని కంచెన్నగారిపల్లె పోలింగ్ స్టేషన్ నుంచి మొదటి రౌండ్ కౌంటింగ్ ప్రారంభమవుతుంది. తరువాత కొన్ని గ్రామాల ఈవీఎంల కౌంటింగ్ అనంతరం కమలాపురం పట్టణ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించి కౌంటింగ్ జరుగుతుంది. 2వ రౌండ్ దాదాపు పూర్తిగా కమలాపురం పట్టణ పోలింగ్ స్టేషన్‌ల కౌంటింగ్ జరుగుతుంది. 3, 4 రౌండ్లలో కమలాపురం మండల పరిధిలోని ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 5వ రౌండ్‌లో మొదటి 3 పోలింగ్ స్టేషన్‌ల కౌంటింగ్‌తో కమలాపురం మండల కౌంటింగ్ పూర్తవుతుంది. తరువాత ఇదే రౌండ్‌లో చెన్నూరు మండల ఓట్ల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. 6వ రౌండ్ మొత్తం, 7వ రౌండ్‌లోని మొదటి 11 పోలింగ్ స్టేషన్‌ల కౌంటింగ్‌తో చెన్నూరు మండల కౌంటింగ్ పూర్తవుతుంది. ఈ రౌండ్‌లో చివరి 3 పోలింగ్ స్టేషన్‌లు వల్లూరు మండల పరిధిలో వున్నాయి. 8వ రౌండ్ మొత్తం, 9వ రౌండ్‌లోని మొదటి 11 పోలింగ్ స్టేషన్‌ల కౌంటింగ్‌తో వల్లూరు మండల కౌంటింగ్ పూర్తవుతుంది. ఈ రౌండ్‌లో చివరి 3 పోలింగ్ స్టేషన్‌లు వీరపునాయునిపల్లె మండల పరిధిలో వున్నాయి. 10, 11 రౌండ్లలో వీరపునాయునిపల్లె మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్‌ల లెక్కింపు పూర్తవుతుంది. 12వ రౌండ్‌లో పెండ్లిమర్రి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 13, 14, రౌండ్లు పూర్తిగా, 15 రౌండ్‌లోని మొదటి 2 పోలింగ్ కేంద్రాల కౌంటింగ్‌తో పెండ్లిమర్రి మండల కౌంటింగ్ పూర్తవుతుంది. 15వ రౌండ్‌లోని చివరి 12 పోలింగ్ కేంద్రాలు చింతకొమ్మదిన్నె మండల పరిధిలో వున్నాయి. దీంతోపాటు 16, 17, 18 రౌండ్లలో ఈ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇందులో చివరగా ఈ మండల పరిధిలోని విశ్వనాథపురం పోలింగ్ కేంద్రం ఓట్ల లెక్కింపుతో నియోజవర్గ కౌంటింగ్ పూర్తయి ఫలితం తేలుతుంది.

జిల్లాలో మొదట వెలువడే అవకాశం

జిల్లా పరిధిలోని మిగిలిన నియోజవర్గాల రౌండ్ల కంటే కమలాపురం నియోజవర్గ కౌంటింగ్ రౌండ్లు తక్కువగా వున్న నేపథ్యంలో.. ఈ నియోజకవర్గ ఫలితం మొట్ట మొదట వెలువడే అవకాశాలు వున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

వర్షం.. తడిచిన ధాన్యం



తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

మైదుకూరు : మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో పంచాయతీలోని ప్రకాష్ నగర్ వాసులకు కష్టాలు వచ్చి పడ్డాయి. తిప్పిరెడ్డిపల్లె ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. గ్రామానికి పక్కనే ఉన్న అటవీ కొండ ప్రాంతానికి రక్షణగా అధికారులు తవ్వించిన ట్రెంచ్ (కందకం)లోకి చేరిన వర్షపు నీరు పొంగి పొర్లి కొండ కిందనే ఉన్న ప్రకాష్ నగర్‌లోని ఇళ్లల్లోకి వచ్చాయి. ట్రెంచ్‌కు సమీపంలోనే ఉన్న కైపు బాలసుందరం అనే వ్యక్తి ఇంటిలోకి నీళ్లు రావడంతో ఇంటిలో ఉన్న 8 బస్తాల వరి ధాన్యం తడిచిపోయింది. పక్కపక్కనే ఉన్న శాంతమ్మ, అబ్రహం, విజయ్‌కుమార్, పీరయ్య, బయమ్మ, సిద్ధయ్య ఇళ్లల్లోకి కూడా వరద నీరు చొరబడింది. గ్రామస్తులంతా ట్రెంచ్‌కు అడ్డంగా రాళ్లు మట్టిని పోసి ఆపేందుకు ప్రయత్నించారు. తర్వాత వరద నీటిని గ్రామంలోకి రాకుండా పడమటి వైపున ఉన్న గంగిపోగు విజయరాజు పొలంలోకి మళ్లించారు. తమ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న సూరబోడు, దయ్యాల చెల ప్రాంతంలో కురిసిన వర్షపు నీరంతా ట్రెంచ్ గుండా తమ గ్రామంలోకి వచ్చిందని ప్రకాష్ నగర్ వాసులు తెలిపారు. వర్షాలు కురిసినప్పుడల్లా తాము ఇబ్బందులు పడకుండా అటవీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని వనిపెంట అటవీ రేంజ్ అధికారి ప్రణీతరావు దృష్టికి తీసుకెళ్లగా.. ప్రకాష్‌నగర్ గ్రామానికి తూర్పు వైపున ఉన్న అటవీ కొండకు రక్షణగా 8 ఏళ్ల కిందట ట్రెంచ్‌ను తవ్వారని తెలిపారు. ట్రెంచ్ చిన్నదిగా ఉండటంతో వరద నీటితో నిండిపోయి పొర్లి పోయిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి రక్షణ గోడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్: గుంటూరులో ఈనెల 2వ తేదీ నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఓపన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారిణి అమీనా అండర్–9 విభాగంలో మూడోస్థానంలో నిలిచింది. ఏడు రౌండ్లలో 3 పాయింట్లు సాధించింది. ఈమెతో పాటు కడపకు చెందిన అనీస్‌దర్బారీ 5 పాయింట్లు, ప్రణవి 4 పాయింట్లు సాధించారు.

జమ్మలమడుగు 23 రౌండ్లు

- పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల నుంచి ప్రారంభం
- ఎర్రగుంట్ల మండలంలోని కర్చుకుంటపల్లె ఈవీఎంతో ముగింపు



ఈవీఎం యంత్రం

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లో మొత్తం 242556 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 102789 మంది, స్త్రీలు 107449 మందితోపాటు, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 210241 మంది ఓటు వేశారు. 86.68 శాతం పోలింగ్ నమోదు అయింది.

ఓట్ల లెక్కింపు ఇలా..

జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి పోలైన 210241 ఓట్ల లెక్కింపు 23 రౌండ్లలో జరగనుంది. మొత్తం 315 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొదటగా పెద్దముడియం మండలం కొండ సుంకేసులలోని పోలింగ్ కేంద్రం–1 నుంచి ఈవీఎంతో లెక్కింపు ప్రారంభమవుతుంది. అనంతరం మైలవరం, జమ్మలమడుగు రూరల్, జమ్మలమడుగు టౌన్, కొండాపురం, ముద్దనూరు మండలం తర్వాత చివరగా ఎర్రగుంట్ల మండలం కర్చుకుంటపల్లె ఈవీఎం లెక్కింపుతో కౌంటింగ్ ముగుస్తుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4న కడపలో జరగనుంది. కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 23 రౌండ్లలో ఫలితం తేలనుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు. ఆ తరువాత ఈవీఎంలను లెక్కిస్తారు.

పోలింగ్ బూత్‌ల ప్రకారం ఈవీఎంల లెక్కింపు ఇలా..

1వ రౌండ్ 1-14 , 2వ రౌండ్ 15-28, 3వ రౌండ్ 29-42, 4వ రౌండ్ 43-56, 5వ రౌండ్ 57-70, 6వ రౌండ్ 71-84, 7వ రౌండ్ 85-98, 8వ రౌండ్ 99-112, 9వ రౌండ్ 113-126, 10వ రౌండ్ 127-140, 11వ రౌండ్ 141-154, 12వ రౌండ్ 155-168, 13వ రౌండ్ 169 -182, 14వ రౌండ్ 183-196, 15వ రౌండ్ 197-210, 16వ రౌండ్ 211-224, 17వ రౌండ్ 225-238, 18వ రౌండ్ 239-252, 19వ రౌండ్ 253-266, 20వ రౌండ్ 267-280, 21వ రౌండ్ 281-294, 22వ రౌండ్ 295-308, 23వ రౌండ్‌లో 309-315 వరకూ ఉన్న పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను లెక్కించనున్నారు. చివరి రౌండ్‌లో 7 ఈవీఎంలను మాత్రమే లెక్కించనున్నారు. ఎర్రగంట్ల మండలం లెక్కింపు 17వ రౌండ్‌లో 237 నుంచి ప్రారంభమవుతుంది.

లింగ వివక్షపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ఆరోగ్య జిల్లా ప్రచార అధికారిణి రమణమ్మ

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని కోవరంగుట్టపల్లె గ్రామంలో డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో సోమవారం లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప ఆరోగ్య జిల్లా ప్రచార అధికారిణి(డిప్యూటీ డెమో) రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్ట ప్రకారం ఏ గర్భిణీ స్త్రీ అయినా ఆసుపత్రికి వెళ్లి స్కానింగ్ చేయించుకునేటప్పుడు ఆడ, మగ అని అడగరాదన్నారు. అలా అడిగినట్లయితే అడిగిన వారికి, చెప్పిన వారికి శిక్ష పడుతుందన్నారు. స్కానింగ్ చేసి ఆడ, మగ అని తెలియజేస్తే స్కానింగ్ యజమానులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానాతోపాటు సెంటర్లను మూసివేయడం జరుగుతుందన్నారు. అనంతరం హెల్త్‌ఎడ్యుకేటర్ ఓబులేసు మాట్లాడుతూ తొందరలోనే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



రోడ్డుప్రమాదాల నివారణపై రూపొందించిన ప్లకార్డులతో విద్యార్థులు

కడప కల్చరల్ : రోడ్డు ప్రమాదాలను నివారించే బాధ్యత పౌరులందరిపైన ఉందని సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. జిల్లాలో వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలలో భాగంగా సోమవారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు నియమాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల గురించి ఆయన రూపొందించిన ఛాయాచిత్ర పోస్టర్లు విద్యార్థులకు ప్రదర్శించారు. విద్యార్థులు రోడ్డు నియమాలను తెలుసుకొని భద్రతా నియమాలు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతని, అందరూ రోడ్డు నియమాలు తెలుసుకొని పాటించినపుడే ప్రయాణాలు సౌకర్యవంతంగా, క్షేమదాయకంగా సాగుతాయన్నారు. పరిమితవేగంతో వెళ్లాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత విషయాలన్నీ ప్రతి ఒక్కరూ తెలుసుకుని జీవితంలో అనుసరించాలని, రోడ్డు భద్రత పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ విద్యార్థుల చేత రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఇ. పవన్ కుమార్, లైబ్రేరియన్ బాబ్జీ, సురేష్ సుబ్రమణ్యం ,జేమ్స్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కౌంటింగ్ సందర్భంగా కఠిన ఆంక్షలు



సీఐ శంకర్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల పట్టణంలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కఠిన ఆంక్షలు విధించడం జరిగిందని అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం పట్టణంలోని అన్ని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దాబాలు మూసివేయాలన్నారు. ఆర్టీసీ బస్సులకు కూడా పట్టణంలోకి ప్రవేశం లేదని, కేవలం రింగురోడ్డులోనే ప్రయాణం చేస్తాయని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయరాదన్నారు. పట్టణంలో మంగళవారం పూర్తి స్థాయిలో కర్ఫ్యూ వాతావరణం ఉంటుందని, కావున ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో కూడా రోడ్లపైకి రాకూడదన్నారు. వైద్య చికిత్సలు వంటి అత్యవసరాలు తప్ప బయట కనిపించకూడదన్నారు. ఎలాంటి ఊరేగింపులు కానీ, సభలు, ధర్నాలు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఎక్కడే గానీ బాణాసంచా కాల్చరాదన్నారు. అలా కాకుండా ఎవరైనా బాణాసంచా కాలిస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని.. నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఆఫీసుల వద్దకు రాకూడదన్నారు. పట్టణంలో స్థానికులు తప్ప స్థానికేతరులకు అనుమతి లేదన్నారు. పై ఆంక్షలు అతిక్రమించినచో కఠినమైన ఆంక్షలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



ముద్దనూరులో కవాతు నిర్వహిస్తున్న సీఐ, సిబ్బంది

పటిష్ట బందోబస్తు

ముద్దనూరు : ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా మంగళవారం మండల వ్యాప్తంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తుంటారని, 144 సెక్షన్ అమలులో వున్నందున ప్రజలు ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున అనవసరంగా బయట తిరిగితే తగిన చర్యలు తీసుకుంటామనితెలిపారు.

నిర్మానుష్యంగా రోడ్లు

కమలాపురం : కమలాపురంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలసి పట్టణంలో గస్తీ నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి షాపులన్నీ మూయించారు. ప్రజలెవరూ రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. గత నాలుగు రోజులుగా ప్రత్యేక వాహనంలో మైక్ ఏర్పాటు చేసి షాపులన్నీ మూసివేయాలని అనౌన్స్ చేయడంతో ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించారు. 6 గంటలకే షాపులన్నీ మూసివేయడంతో కరోనా సమయంలో ఉన్న వాతావరణం తలపించింది. ఈ సందర్భంగా ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సెక్షన్ 144(2) సీఆర్‌పీసీ, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురికి మించి ఉండకూడదన్నారు. అలాగే బుధవారం ఉదయం వరకు షాపులు తెరవకూడదన్నారు. కౌంటింగ్ అనంతరం ఎవరైనా సరే బాణా సంచా కాల్చడం, డప్పులు, డీజేలు మోగించడం చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. వాట్సప్ గ్రూప్‌లో గానీ, సోషల్ మీడియాలో గానీ రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప, బయటకు రావదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



హార్టికల్చర్ అధికారి ప్రశాంతికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతకొమ్మదిన్నె : మండలంలో ఎండిపోతున్న అరటి, ఆకు తోటలు, చీనీ, నిమ్మ తోతోటల రైతులను ఆదుకోవాలని మండల హార్టికల్చర్ అధికారి ప్రశాంతికి ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలంలో తీవ్ర వర్షాభావం, ఎండల తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో అరటి, చీని, నిమ్మ, ఆకు తోటలను ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మండల పరిధి లింగారెడ్డిపల్లి, కొలుములపల్లె పంచాయతీలోని పంట పొలాలను రైతు సంఘం ప్రతినిధులు ఆదివారం పరిశీలించినట్లు చెప్పారు. అక్కడ పరిశీలించిన అంశాలు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఒకపక్క, మరోపక్క ఎండ తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో.. అరటి, చీని, నిమ్మ, ఆకుతోటలు కోత దశలో ఉండగా నీటి తడులు అందక నిట్ట నిలువునా ఎండిపోతున్నాయని తెలిపారు. అరటి, ఆకు తోటలకు సాగు పెట్టుబడి ఖర్చులు ఎకరాకు లక్ష రూపాయలు పైగా వస్తోందని, ఈ తరుణంలో బోరు బావులు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో లేత దశలోనే పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉన్నదని, ఎకరాకు కౌలు 50 వేలకు పైగా పెట్టి సాగు చేస్తున్నారని అన్నారు. అధికారులు న్యాయం చేయని పక్షంలో పంటలు నష్టపోయిన రైతులను కలుపుకొని ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోయి రైతులకు న్యాయం చేస్తామని హార్టికల్చర్ అధికారి ప్రశాంతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల నాయకులు రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి




బద్వేలు అర్బన్: బాలాయపల్లెలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని బాలాయపల్లె ఎస్సీకాలనీలో సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమలను లార్వా దశలోనే గుర్తించి యాంటీలార్వా విధానాలను పాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని అన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ జోత్స్న, ఆరోగ్య సిబ్బంది రమాదేవి, దీపిక, లక్షుమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆదిత్యారాంపేట, పాయలకుంట్ల గ్రామాల్లో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధులపై వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ప్రజలచే దోమల నియంత్రణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు గౌతమి, కుమారి, ప్రియదర్శి, ఏఎన్‌ఎంలు లక్ష్మిదేవి, మల్లిక, ఆశా కార్యకర్తలు రమాదేవి, జ్యోతి, వీరనారాయణమ్మ, గ్రామ పెద్దలు వెంకటనారాయణ, పిచ్చిరెడ్డి, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం



భోజనం వడ్డిస్తున్న జూటూరు మధుసూదన్ రావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జూటూరు మధుసూదన్‌రావు దంపతులు అన్నదానం చేశారని సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సభ్యులు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శివోహం సేవా సంఘం కమిటీ సభ్యులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను కార్మికులుగా మార్చవద్దు

కడప ఎడ్యుకేషన్ : బడి ఈడు పిల్లలను షాపుల్లో, కర్మాగారాల్లో కూలీలుగా, కార్మికులుగా పనిలో పెట్టుకోవద్దని లేబర్ ఆఫీసర్ ఫాల్ జాన్సన్ మునిస్వామి, లీగల్ ప్రొబిషన్ ఆఫీసర్ సునీత పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి పరిసర వీధుల్లో, షాపులను, మెకానిక్ షెడ్లను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని షాపు యజమానులకు సూచించారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉండటం నేరమని, అలా పనిలో ఉంచుకుంటే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.